ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
గురువారం 4 డిసెంబరు 2025





చెంగల్రాయకొండపై ధర్మకర్త రఘు దీపారాధన








అగస్త్యేశ్వరాలయంలో , సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దీపారాధనలు - జఢాదర కొండపై ధర్మకర్త గుణశేఖర్ దీపారాధన

వైభవంగా కృత్తిక దీపోత్సవాలు



జఢాధర కొండపై అఖండజ్యోతి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం కార్తిక కృత్తిక దీప మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనగర్ కాలనీకి చెందిన బి.వి. దామోదర నాయుడు ఉభయంతో గిరింపేట వళ్లీ దేవసేన సమేత చెంగల్రాయ కొండ సుబ్రమణ్యేశ్వరాలయంలో వంశపారంపర్య ధర్మకర్త రఘు దీపారాధన చేపట్టారు. భక్తుల హరోం హర నినాదాల నడుమ చెంగల్రాయ కొండ పైకి ఊరేగింపుగా అఖండ దీపాన్ని తీసుకువెళ్ళి వెలిగించారు.అంతకు మునుపు స్వామి,అమ్మవార్లకు ఆలయ చైర్మన్ ఎ.జి.సంపత్,ఈవో సుబ్రహ్మణ్య నాయుడు ఆధ్వర్యంలో అర్చకులు పద్మనాభ గురుకుల్ స్వామి పాలు,తైల,విభూతి అభిషేకాలు నిర్వహించారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కార్పొరేటర్ ఇంద్రశ్రీ తదితరులు పాల్గొన్నారు. జఢాదర కొండపై కార్తీక మాస కృత్తిక దీపారాధనలను ధర్మకర్త గుణశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అగస్తీశ్వర,కట్టమంచి కులందేశ్వర,ఇరువారం నాగేంద్ర స్వామి, నీవానది రాజుగుడి, బజారు వీధి శివ షణ్ముగ ఆలయాల్లో కూడా కార్తీక మాస కృత్తిక దీపోత్సవాలు ఘనంగా జరిగాయి.

డివిజన్ స్థాయిలో మినీ కలెక్టరేట్లు

- పంచాయతీరాజ్‌లో కీలక సంస్కరణలు
- డివిజన్ స్థాయిలో ఒకే గొడుగు కిందకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు
- చిత్తూరునుంచి డీడీవో కార్యాలయాలకు నేడు డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం

చిత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ సంస్కరణల్లో భాగంగా కూటమి ప్రభుత్వం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో)లకు విశేష అధికారాలను అప్పగించింది. డీడీవోల జాబ్‌చార్ట్‌ను మారుస్తూ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురానున్నారు. డివిజన్ స్థాయిలో ఉన్న పంచాయతీ ఆఫీసు (డీఎల్‌పీవో), డ్వామా ఏపీడీ, ఇతర శాఖల డివిజనల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మారుస్తున్నారు. డివిజన్ స్థాయిలో ఈ డీడీవో కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా ప్రజలకు సేవలందించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.ప్రస్తుతం జిల్లాలో చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి రెవెన్యూ సబ్ డివిజన్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ డివిజన్లను కూడా ఈ సబ్ డివిజన్లకు సమాంతరంగా ఏర్పాటు చేశారు. ఆర్డీవోకు సమానమైన డీడీవోలకు కూడా దాదాపు అదే స్థాయిలో అధికారాలూ ఇచ్చారు. ఇక నుంచి జిల్లాలో కూడా చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో డీడీవోలు పనిచేయనున్నారు.

పవన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజోతి): రాష్ట్రవ్యాప్తంగా 77డీడీవో కార్యాలయాలను గురువారం జిల్లాకేంద్రమైన చిత్తూరు నుంచి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.చిత్తూరు కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయంలో ఆయన ఇందుకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరించి, మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వర్చువల్ విధానంలో కార్యాలయాలను ప్రారంభించనున్నారు.డిప్యూటీ సీఎం పర్యటనపై మంగళవారం రాత్రి కలెక్టర్ సుమిత్ కుమార్ అందుబాటులో ఉన్న అధికారులతో దాదాపు రెండుగంటల పాటు సమీక్ష నిర్వహించారు. బుధవారం ఉదయం డీడీవో కార్యాలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు చెందిన ముగ్గురు సీనియర్ అధికారులతో మాట్లాడి సజావుగా కార్యక్రమం సాగేవిధంగా తీసుకోవాల్సిన చర్యల గూర్చి చర్చించారు. వీరివెంట జనసేన సీనియర్ నాయకుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఇలా....

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గురువారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయల్దేరి ఉదయం 9.50గంటలకు రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి కారులో చిత్తూరుకు 11.30 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే డీడీవో కార్యాలయాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణమౌతారు.



ఏర్పాట్ల పరిశీలనలో పీఆర్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ సుమిత్‌కుమార్, జనసేన నేత హరిప్రసాద్



డీడీవో నియంత్రణలో..

డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలను డీడీవో నియంత్రిస్తారు. డివిజన్ స్థాయిలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారు. పాలనాపరంగా ప్రతి నెలా కనీసం 20 రోజులు పర్యటించి టూర్ డైరీలను కలెక్టర్లకు సమర్పించాల్సి వుంటుంది. ఎంపీడీవోలతో పాటు డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బంది మొత్తం డీడీవో నియంత్రణలో పని చేస్తారు. ఆరు నెలలకోసారి మండల పరిషత్ కార్యాలయాలను డీడీవో తనిఖీ చేస్తారు.

స్థానిక ఎన్నికల బాధ్యత

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటివరకు డిప్యూటీ డిస్ట్రిక్ ఎలక్షన్ అథారిటీగా ఆర్డీవోలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరించనున్నారు.నిజానికి వైసీపీ హయాంలో పెద్దఎత్తున ఎంపీడీవోలను డీడీవోలుగా ప్రమోట్ చేశారు.అయితే ఒక్కరికీ సరైన పోస్టింగు ఇవ్వలేదు. అందరికీ ఎంపీడీవో స్థాయి కంటే చిన్నదైన డ్వామా ఏపీడీగా పోస్టింగు ఇచ్చారు. ఆయా డివిజన్ కేంద్రాల్లో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల్లోనే డీడీవోలకు ఓ ఛాంబర్ కేటాయించారు. మొత్తానికి డీడీవో వ్యవస్థ వైసీపీ హయాంలో సర్వేలు, నామమాత్రపు పర్యవేక్షణకే పరిమితమైంది.

చిత్తూరునుంచే 77 కార్యాలయాల ప్రారంభం

రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గురువారం ప్రారంభించనుంది. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ చిత్తూరు నుంచి వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఇలాగేనా స్పందన!

- కమిషనర్ వీరపాండియన్ ఆగ్రహం

చిత్తూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) జిల్లాలోనే స్క్రబ్ టైఫస్ కేసులు అధికకంగా నమోదవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ . కేసులు వచ్చిన ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేసులు ఎక్కువున్న ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు విరివిగా నిర్వహించాలన్నారు. మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదిలా వుండగా వ్యాధి సోకిందా లేదా అని తెలుసుకునేందుకు పరీక్ష కిట్లు, వైరాలజీ ల్యాబ్‌లు అందుబాటులో లేవు. వేలూరు సీఎంసీకో, తిరుపతి రుయాస్పత్రికో వెళ్లవలసి వస్తోందని వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అనుమానితులను భయపెట్టి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి.

చింటూకు హైకోర్టులో ఊరట

అమరావతి/చిత్తూరు లీగల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రథమ మేయర్ దంపతుల హత్య కేసులో ఉరిశిక్ష పడ్డ ప్రధాన నిందితుడు శ్రీరామ చంద్రశేఖర్ అలియాస్ చింటూకు హైకోర్టులో తాత్కాలికంగా ఊరట కలిగింది.ట్రయల్ కోర్టు విధించిన రూ.70లక్షల జరిమానాను సస్పెండ్ చేయాలని కోరుతూ చింటూ వేసిన అనుబంధ పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. విచారణ జరిపిన ధర్మాసనం సీఆర్‌పీసీ సెక్షన్ 357(2) అనుసరించి అప్పీల్‌పై విచారణ జరిపి నిర్ణయం వెల్లడించే వరకు ట్రయల్ కోర్టు విధించిన జరిమానాను చెల్లించాల్సిన అవసరంలేదని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో అనుబంధ పిటిషన్‌లో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంటూ దానిని మూసివేసింది.అప్పీల్‌ను రిఫర్డ్ ట్రయల్ పిటిషన్‌తో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.చిత్తూరు ప్రథమ మేయర్ అనురాధ, భర్త కఠారి మోహన్ హత్య కేసులో ఉరిశిక్షతో పాటు 70లక్షల రూపాయల జరిమానా విధిస్తూ చిత్తూరుజిల్లా అదనపు సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రధాన నిందితుడు చింటూ అప్పీల్ వేశారు. అప్పీల్ వేసిన నేపథ్యంలో జరిమానా చెల్లింపు ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని అనుబంధ పిటిషన్ వేశారు. అప్పిలెంట్ తరఫున సీనియర్ న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 357(2)ని అనుసరించి ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ వేసిన అప్పీల్‌పై నిర్ణయం వెల్లడించేవరకు జరిమానాను చెల్లించాల్సిన అవసరం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

28 మండలాల్లో వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడచిన 24 గంటల్లో నాలుగు మండలాలు మినహా 28 మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురంలో 24.2మి.మీ, అత్యల్పంగా పెనుమూరులో 0.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది. కార్వేటినగరంలో 18, వెదురుకుప్పంలో 12.6, సోమలలో 12.4, రొంపిచెర్లలో 9.2, శ్రీరంగరాజపురం, నింద్ర మండలాల్లో 7.2, పాలసముద్రంలో 6.2, బంగారుపాళ్యంలో 6, చిత్తూరు అర్బన్, గంగాధరనెల్లూరు, నగరి మండలాల్లో 3.4, గుడిపాలలో 3.2, పులిచెర్ల, చౌడేపల్లె, యాదమరి మండలాల్లో 3, పుంగనూరు, పెద్దపంజాణి, చిత్తూరు రూరల్, రామకుప్పం మండలాల్లో 2.8, బైరాల, గంగవరం మండలాల్లో 2.4, కుప్పంలో 2, పలమనేరులో 1.8, తవణంపల్లె, వి.కోట మండలాల్లో 1.4, సదుంలో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.



చిత్తూరులో వర్షం

దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాలి

ఎస్పీ తుషార్ డూడి



దివ్యాంగురాలికి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సమాజంలో ముందడుగు వేసేలా మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కులు, వారికి అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. సమాజం దివ్యాంగులను అర్థం చేసుకుని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు వ్యవస్థ కేవలం చట్ట వ్యవస్థను కాపాడటమే కాకుండా సామాజిక బాధ్యతల పరంగా ముందుండి పనిచేస్తుందన్నారు. దివ్యాంగులపై వేధింపులకు పాల్పడిన లేదా హక్కుల ఉల్లంఘనలకు గురిచేస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. దివ్యాంగులకు చేసే చిన్నసహాయం కూడా వారి జీవితాల్లో పెద్ద మార్పును తీసుకొస్తుందన్నారు. వివిధ రకాల క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి ఎస్పీ మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, దివ్యాంగుల శాఖ ఇన్‌ఛార్జి ఏడీ విక్రమ్ కుమార్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గాయపడ్డ ఏనుగు మృతి



మృతి చెందిన ఏనుగు

మంగళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):కాలు విరిగి నడవలేని స్థితిలో యాదమరి మండలం నుంచి తిరుపతిలోని ఎస్వీ జూ పునరావాస కేంద్రానికి తరలిన 25 ఏళ్ల ఒంటరి ఏనుగు బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది.తమిళనాడు రాష్ట్రం నుంచి పదిరోజుల క్రితం యాదమరి మండలంలోకి ప్రవేశించిన ఈ ఏనుగు గత శనివారం యాదమరి మండలం కమ్మపల్లి అటవీ బీట్‌లోని గుడ్డివానిచెరువు వద్ద జారిపడడంతో కాలు దెబ్బతిని కదల్లేని స్థితికి చేరుకుంది. ఆదివారం అటవీశాఖ అధికారులు, వైద్యులు పరిశీలించి కుంకీ ఏనుగుల సాయంతో చెరువు నుంచి బయటకు తీసుకొచ్చారు.సోమవారం మధ్యాహ్నం భారీ క్రేన్ ద్వారా ఏనుగును లారీలో ఎక్కించి తిరుపతిలోని ఎస్వీ జూకు తరలించారు.అయితే గాయాలు మానడానికి వెటర్నరీ డాక్టర్లు చేసిన ప్రయత్నాలకు ఏనుగు శరీరం సహకరించలేదు. దీనికితోడు రక్తం విషపూరితంగా మారిపోవడంతో ఏనుగు మృతి చెందినట్లు వెటర్నరీ యూనివర్శిటీ పాథాలజీ విభాగం నిర్వహించిన పోస్టుమార్టంలో తేలిందని జూక్యూరేటర్ సెల్వం చెప్పారు.కళేబరాన్ని ఎస్వీ జూపార్కు ఆవరణలో చిత్తూరు అటవీ శాఖ అధికారులు, పశువైద్య బృందాల సమక్షంలో ఖననం చేశామన్నారు.

ముగ్గురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు అర్బన్ సీఐ కె. మురళీమోహన్‌ను స్పెషల్ బ్రాంచ్ సీఐగా బదిలీ చేశారు. పూతలపట్టు అర్బన్ సీఐ కృష్ణమోహన్‌ను వీఆర్‌కు, చిత్తూరులో వీఆర్‌లో ఉన్న డి.గోవిని పూతలపట్టు అర్బన్ సీఐగా బదిలీ చేశారు.

డీఆర్‌సీ సమావేశాలకు ఇక కార్పొరేషన్ చైర్మన్లు

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు జిల్లా సమీక్షా మండలి సమావేశాలకు హాజరయ్యే అవకాశం లభించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ జిల్లా సమీక్షా మండలి సమావేశాలకు ఆయా జిల్లాల పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మాత్రమే పాల్గొనేందుకు వీలుండేది. ఇపుడు అదనంగా జిల్లా పరిధిలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు కూడా ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో పాల్గొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వారిని సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో ఆహ్వానించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. తాజా ఉత్తర్వులతో తిరుపతి జిల్లా పరిధిలోని యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ కూడా డీఆర్సీ సమావేశాల్లో పాల్గొననున్నారు. నిబంధనల ప్రకారం రెండు నెలలకొకసారి విధిగా డీఆర్సీ సమావేశం నిర్వహించాలని కూడా ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

వరి రైతుల వర్రీ !

- గ్రాసం కోసం అవస్థలు
- నట్టేట ముంచిన వరుస తుఫాన్లు

సోమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):వరుస తుఫాన్లతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పశ్చిమ మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశుపోషణే ప్రధాన జీవనాధారమైన రైతులు వందలాది ఎకరాల్లో వరిపంటనే ఎక్కువగా సాగు చేస్తుంటారు. వరుస తుఫాన్ల ప్రభావంతో నెల నుంచి రెండు దఫాలుగా వర్షాలు కురుస్తున్నాయి. వరికోతల సమయంలో వర్షాలు కురవడంతో కోతలు చేయలేకపోతున్నారు. దీనికి తోడుగా కూలీల కొరత తీవ్రంగా ఉంది. టమోటా పంటలకే కూలీలు పరిమితమై వరి కోతలకు రావడం లేదు. అన్నమయ్య జిల్లాలోని కలకడ, సంబేపల్లె, కలికిరి తదితర ప్రాంతాలకు టమోటా కోతలు, ఇతర పనులకు అక్కడి రైతులు సోమల మండలం నుంచే ప్రైవేటు వాహనాల్లో కూలీలను తీసుకెళుతున్నారు.దీంతో వరికోతలు సకాలంలో చేయలేకపోతున్నారు.కోతలు చేసి ధాన్యాన్ని బండలపై నిల్వ చేయడంతో అది తడిసిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో వరి ధాన్యం మొలకలు వస్తోంది.దీంతో వరి గడ్డి కరువై నెల్లూరు, నాయుడుపేట ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సివస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గన్నావారి పల్లె సమీపంలో నేలవాలిన వరిపంట

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ, జనసేన నేత హరిప్రసాద్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురువారం చిత్తూరులో పర్యటించనున్న నేపథ్యంలో ఎస్పీ తుషార్ డూడీ బుధవారం ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమ ప్రాంగణం, రూట్ మ్యాప్, పార్కింగ్ ప్రాంతాలు, జన సంచారం ఎక్కువగా కీలక కూడళ్లల్లో అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. ట్రాఫిక్ డైవర్షన్‌ను ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు. వీఐపీ చెక్‌పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమ స్థలంలో బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో సమగ్ర తనిఖీలు నిర్వహించి భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. మెడికల్ టీము, అగ్నిమాపక సిబ్బంది, ఎమెర్జెన్సీ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఎస్బీ సీఐ మనోహర్, సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య, ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జంతువుల దాడిలో పాడిదూడ హతం

యాదమరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతానికి సమీపంలోని రైతు పాడిదూడను అటవీ జంతువులు చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దళవాయిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం పొలం అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉంది. రెండురోజుల క్రితం ఆవులను మేత కోసం వదిలారు. సాయంత్రం అందులో ఒక దూడ కనిపించలేదు. పొలానికి సమీపంలో పాడిదూడను అటవీ జంతువులు చంపినట్లు మంగళవారం గుర్తించారు. బాధిత రైతు వెం టనే అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దూడను హైనా లేక రేసుకుక్కలు చంపివుండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.

హిందూ దేవుళ్లను హేళన చేస్తే సహించేదిలేదు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను హేళనచేస్తే సహించేదిలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి టీటీడీ ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ వీడియోను విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో సినీ నటులు



జయం రవి, కెనీషా

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో భారత్ బయోటెక్ జేఎండీ సుచిత్ర ఎల్లా, చైర్మన్ కృష్ణా ఎల్లా, రాయలసీమ రేంజ్ ఏసీబీ జేడీ అశోక్‌కుమార్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తమిళ హీరో జయం రవి, గాయని కెనీషా, సినీ హీరో సుధాకర్, బిగ్‌బాస్ కంటెస్టెంట్, నటుడు జస్వంత్(జెస్సీ), నటుడు బబ్లూ ఉన్నారు.

మానస్ సరోవర్ వర్సిటీ ఏర్పాటుకు భూముల పరిశీలన



టీడీపీ నేతలతో కలిసి భూములను పరిశీలిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

రామకుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో యూనివర్సిటీ ఏర్పాటుకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని మానస్ సరోవర్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. యూనివర్సిటీ ప్రతినిధులు సాగర్, కోటేశ్వరరావులు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి ఇతర నేతలతో కలిసి బుధవారం మండల పరిధిలోని బగళనత్తం, కృష్ణానగర్‌ల వద్ద గల భూములను పరిశీలించారు. మానస్ యూనివర్సిటీ వారు రామకుప్పం మండలంలో 200 ఎకరాల్లో కొత్త యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారని ఆనందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బందార్లపల్లె యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు బాలకృష్ణారెడ్డి, రుష్యంత్‌సింగ్, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా చొక్కాణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలోని మహానంది వద్ద బుధవారం రాత్రి చొక్కాని ఉత్సవం వైభవంగా సాగింది. తమిళ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని చుక్కాని ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవానికి ఒకరోజు ముందు అంటే మంగళవారం రాత్రి ఆలయంలో వేదపండితులు కలశ స్థాపనతో కృతవును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అమ్మవారి సన్నిధి వద్ద బాలదీపాలను వెలిగించి స్వామివారి సన్నిధి వద్ద భద్రపరిచారు. బుధవారం రాత్రి వరకు దీపాలు నిరంతరాయం వెలిగేలా ఏర్పాటు చేశారు. ఉదయం మహానంది వద్ద వేదపండితులు కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాటిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తాటిచెట్టును మహానంది వెనుకవైపున నిలబెట్టారు. చుట్టూ మట్టలను కప్పారు. రాత్రి ఆలయం నుంచి బాలాదీపాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య ఊరేగింపుగా తాటిచెట్టు వరకు తీసుకువచ్చి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి చొక్కాణిని వెలిగించారు. చొక్కాణి జ్యోతి అఖండ ప్రజ్వలనతో ప్రకాశించింది. ఈ ఘట్టాన్ని తిలికించేందుకు సాయంత్రం నుంచే భక్తులు వర్షంలో తడుస్తూనే నిరీక్షించారు. చొక్కాణి పూర్తయిన తర్వాత అందులోని భస్మాన్ని ఈశ్వరప్రసాదంగా భావించి భక్తులు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా స్వామి అమ్మవార్లను తీసుకొస్తున్న దృశ్యం







దేవరకొండ బురుజుపై వెలుగుతున్న జ్వాలా దీపం -దీపాలు వెలిగించిన మహిళలు - శివపార్వతులకు కళ్యాణోత్సవం

మొగిలిలో ఘనంగా కార్తీక దీపోత్సవం

బంగారుపాళ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వరుడికి అనుబంధంగా ఉన్న దేవరకొండపై ఘనంగా కార్తీక దీపోత్సవం జరిగింది. బుధవారం ఉదయం మొగిలీశ్వరుడి ఆలయంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు గుడి ఆవరణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బురుజుపై నెయ్యి, నూనె పోసి జ్వాలాదీపాన్ని అర్చకులు రెడ్డెప్ప గురుకుల్ వెలిగించారు. రాత్రి పార్వతి,పరమేశ్వరులకు మంగళవాయిద్యాల నడుమ కళ్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా మండల టీడీపీ గౌరవాధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, ఎన్పీ సుచిత్ర వ్యవహరించారు.ఆలయ ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో మునిరాజ,అర్చకులు హరికేష్ గురుకుల్, ఎన్పీ వెంకట్,ఎన్పీ రంజిత్, ధనంజయనాయుడు, మంజునాథ పాల్గొన్నారు.

సంఘమిత్ర స్వాహా చేసిన నిధుల రికవరీ ఏదీ?

పుంగనూరులో డ్వాక్రా మహిళల నిరసన



మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత మహిళలు

పుంగనూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ పేర్లతో ఏడాది క్రితం ఉన్నతి రుణాలు స్వాహా చేసిన మాజీ సంఘమిత్ర నుంచి నిధులు రికవరీ చేసి న్యాయం చేయాలంటూ పుంగనూరు మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం పుంగనూరు మండలం మంగళం గ్రామ సమాఖ్య-2లోని 7 ఎస్‌హెచ్‌జీ (డ్వాక్రా) సంఘ సభ్యులు కార్యాలయం వద్ద తమకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మంగళం వీవో-2లో పనిచేసే సంఘమిత్ర లక్ష్మీదేవి ఏడాది క్రితం ఒక్కొక్కరి పేరుతో రూ.50 వేలు చొప్పున ఎస్సీలకు ఇచ్చే ఉన్నతి రుణాలు రూ.7.50 లక్షలు కాజేసిందని.. అలాగే రూ.30 లక్షల వరకు నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. రుణబకాయిలు ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించి ఎలాంటి బాకీ లేకపోయినా బకాయిలున్నట్లు ఆన్‌లైన్‌లో రావడం, ఆడిట్‌లో తేలిందని చెప్పారు. తమ పేర్లతో ఎందుకు రుణాలు తీసుకున్నావని లక్ష్మీదేవిని విచారించగా తాను తీసుకున్న రుణాలన్నీ త్వరలో చెల్లిస్తానని చెప్పినా ఇంతవరకు చెల్లించలేదని వాపోయారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏపీఎం రవి, సీసీ నాగరత్నలతో కలిసి నిధులు స్వాహా చేసినట్లు సంఘమిత్ర లక్ష్మీదేవమ్మ సంఘసభ్యుల ఎదుట పోలీసుస్టేషన్‌లో అంగీకరించిందన్నారు. నెలరోజుల్లో తిరిగి సంఘాలకు డబ్బు చెల్లిస్తానని చెప్పినా మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక రూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సంఘమిత్ర నుంచి వసూళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై పుంగనూరు ఏపీఎం కృష్ణప్పను వివరణ కోరగా సంఘమిత్ర రూ.7.50 లక్షలు నిధులు స్వాహా చేయడంతో సంఘమిత్ర లక్ష్మీదేవిని తొలగించామని, గతంలో పనిచేసిన ఏపీఎం, సీసీలు నిధులు వాడుకున్నారని రకరకాలుగా మాజీ సంఘమిత్ర చెప్పడంతో ఈవిషయాన్ని చిత్తూరు ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. రికవరి కోసం పలుమార్లు ప్రయత్నించామని, పీడీ ఆదేశాలతో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టెట్ హాల్ టికెట్ల విడుదల

చిత్తూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష హాల్‌టికెట్లు విడుదల చేసినట్లు ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఏపీ టెట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరుగనుంది. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. ఇందు కోసం భక్తులు 0877 2263261 నెంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

పింఛన్ సమస్యల పరిష్కారానికి కొత్త వేదిక

● మాజీ సైనికులకు డీఆర్వో



మాజీ సైనికుడి భార్యకు పెన్షన్ అందజేస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు తమ పింఛన్, తదితర సమస్యలను పరిష్కరించుకోవాలని డీఆర్వో మోహన్ కుమార్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సిస్టం ఫర్ పింఛన్ అడ్మినిస్ట్రేషన్- రక్ష కార్యక్రమాన్ని కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ విభాగానికి చెందిన ఆడిట్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సిస్టం ఫర్ పింఛన్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సైనికులు తమ పింఛన్ సేవలను, పీపీవో విడుదల, సవరణలు, సమస్యలను ఆన్‌లైన్ ద్వారా సులభతరం చేశామన్నారు. అవుట్‌రీచ్ ప్రోగ్రాం ద్వారా మాజీ సైనికులు తగు రికార్డులతో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి రాఘవులు, కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ అధికారులు కేవీ రమణ, శ్రీరామమూర్తి, మహేష్‌బాబు, సైనిక్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

శబరిమల యాత్రలో విషాదం

కారు ప్రమాదంలో తండ్రీకుమారుల మృతి



కాలువలో పడిపోయిన కారు





వేణు, నరేష్ మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శబరిమలైకు వెళ్లిన తండ్రీకుమారులు కారు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలోని కారణి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేణు(48) బేల్దారి కూలీ. కుమారుడు నరేష్(30) డ్రైవర్. వేణు, నరేష్, ఆయన కుమార్తె చాతుర్య అయ్యప్పస్వామి దీక్ష చేపట్టారు. ఈ నెల ఒకటో తేదీ ఉదయం వేణు, నరేష్, చాతుర్య(9)తో పాటు వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురానికి చెందిన మునితేజ కారణి గ్రామం నుంచి కారులో శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రంలోని తేని పట్టణ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న నరేష్, పక్కనే కూర్చున్న వేణు అక్కడికక్కడే మృతి చెందారు. మునితేజకు రెండు కాళ్లు విరిగిపోగా, చాతుర్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాలకు తేని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మునితేజ అక్కడే చికిత్స పొందుతున్నాడు. గురువారం మృతదేహాలు కారణి గ్రామానికి వస్తాయని తెలిపారు.

రోడ్డు మరమ్మతుల కోసం మహిళల ఆందోళన



మహిళలకు సర్దిచెబుతున్న సీఐ

నగరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశమ్మగుడి సమీపంలో ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు బాగు చేయించాలని మహిళలు బుధవారం రోడ్డు ఎక్కారు. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు గుంతలమయమైందని, ద్విచక్రవాహనాల్లో వెళ్లితే ప్రమాదం తప్పడం లేదని వీరు వాపోయారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో బైఠాయించాల్సి వచ్చిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.వీరి ఆందోళనకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య ఆధ్వర్యం వహించారు. సీఐ మల్లికార్జునరావు వెళ్లి మహిళలకు నచ్చచెప్పారు. తాను కూడా అధికారులకు సమస్యను వివరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మహిళలు ఆందోళన విరమించారు. సీపీఐ నాయకులు సరావుద్దీన్, ఇందిరమ్మ, వార్డు నాయకులు వేలు, నాగరాజు, ఆర్ముగం, బాబు, హేమలత తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే చొరవతో మంజూరైన ఈ రహదారి నిర్మాణ పనులను వర్షాలు తగ్గితే ె ప్రారంభిస్తామని కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు.

హంద్రీ-నీవా జలాలతో చెరువులకు మహర్దశ



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా జలాలతో చెరువులకు మహర్దశ కలుగుతోందని పలమనేరు ఎమ్మెల్యే అమర నాథరెడ్డి అన్నారు. బైరెడ్డిపల్లె చెరువు పూర్తిగా నిండి మొరవపోతున్న సందర్భంగా బుధవారం సాయంత్రం చెరువువద్ద జరిగిన జలహారతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు హంద్రీ-నీవా జలాలను శ్రీశైలం నుంచి కుప్పం వరకు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో గాలేరు-నగరితో చెరువులకు అనుసంధానం చేసి తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో స్వచ్ఛమైన నీరు సరఫరా చేయడానికి కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమం లో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, ఏఎంసీ చైర్మన్ రాజన్న, వివిధశాఖల అధికారులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీడీఈ ఎంఏ పొలిటికల్ సైన్స్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫైనలియర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ రాజమాణిక్యం, ఎగ్జామ్స్ డీన్ సురేంద్రబాబు తెలిపారు.

ఎస్వీయూ పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

● ఫీజు చెల్లింపునకు 12 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు ఈ నెల 12వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఈ విషయమై అనుబంధ కాలేజీలు, విభాగాలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వర్సిటీ పరీక్షల డీన్ కొంగర సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి రాజమాణిక్యం తెలిపారు.

తాగిన మత్తులో నీటితొట్టెలో పడి మృతి

పూతలపట్టు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో నీటితొట్టెలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వడ్డార్లపల్లె గ్రామానికి చెందిన మునిరత్నం (65) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతను రెండ్రోజులక్రితం గ్రామ సమీపాన ఓ నీటి తొట్టెపై కూర్చొని మద్యం తాగుతూ అకస్మాత్తుగా తొట్టెలో పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం పశువుల కాపర్లు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు.

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన బుధవారం పెద్దపంజాణి మండలంలో బుధవారం జరిగింది. పెద్దపంజాణి మండలం శివరామపురానికి చెందిన నరేశ్ కుమార్తె అక్షయని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా యువతి పరిస్థితి ఆందోళనగా ఉందని మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తరలించారు.

దివ్యాంగ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దివ్యాంగ క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 1, 2 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి దివ్యాంగుల (పారాస్పోర్ట్స్) క్రీడాపోటీలు జరిగాయి. ఇందులో బ్యాడ్మింటన్ క్రీడాంశంలో పాల్గొని రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అభినందించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నర్సింగ్ వృత్తి పవిత్రమైంది



నర్సింగ్ తరగతుల ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు తదితరులు

కుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తి పవిత్రమైందని కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు అన్నారు. పీఈఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బుధవారం బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సర తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో ఉన్నవారు సహనం, ఓపిక, దయతో మెలగాలన్నారు. అప్పుడే వృత్తిలో రాణించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈఎస్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే. సుబ్రహ్మణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ఆర్. ర్యాలీ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డానిల్, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పఠనంతో వ్యక్తిత్వ వికాసం


దాతలు వితరణ చేసిన పుస్తకాలతో పిల్లలు, దాతలు తదితరులు

కుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పఠనంతో వ్యక్తిత్వ వికాసం సాధ్యమని కుప్పంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయాధికారి సత్యవాణి అన్నారు. కుప్పం వాసి డాక్టర్ శిల్ప, డాక్టర్ చైతన్య కృష్ణ బుధవారం రూ.15 వేలు విలువ కలిగిన 200 పుస్తకాలను వితరణ చేశారు. వీటిలో ఊహామాల బొమ్మల కథలు, ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలతో కథలు, గేయాలు, పద్యాలతో కూడిన చిన్నచిన్న కథలు ఉన్నాయి. అలాగే కవిత్రయం రచించిన మదాంధ్ర మహాభారత పుస్తకాలను ఉమా నాగరాజ్ వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సత్యవాణి దాతలకు ధన్యవాదాలు తెలిపారు. దాతలు మాట్లాడుతూ ఇటువంటి పుస్తకాలను చదివి, పిల్లలు ఆలోచనా శక్తిని పెంచుకోవాలని, వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ మహేశ్, పిల్లలు, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి


రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిసాగులో రైతులు మెలకువలు పాటించాలన్నారు. మామిడితోటల్లో అంతర పంటలను సాగుచేయాలన్నారు. నవధాన్యాలను సాగుచేయడంతో భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కరుణాకర్‌నాయుడు, అన్సర్‌బాషా, అబ్బాస్, ఇమ్రాన్, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌లో అధునాతన సాంకేతికత వినియోగం


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రిప్ ఇరిగేషన్‌లో అధునాతన సాంకేతికను మరింతగా వినియోగిస్తే రైతుల లాభాలు మరింత పెరుగుతాయని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం చందం పంచాయతీలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ పరికరాలు, డ్రిప్ సిస్టం ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికను రైతులకు మరింతగా అందించాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. పట్టు పరిశ్రమపై రైతులు మరింత ఆసక్తి చూపాలని సూచించారు. అలాగే పశుసంవర్థకక శాఖ ప్రతి ఇంట్లో పాల ఉత్పత్తిని పెంచడంతో కుప్పాన్ని మిల్క్ సిటీగా చేయాలని ఆకాంక్షించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మండల వ్యవసాయాధికారి ఫయాజ్, వెటర్నరీ ఏడీ కోదండ, సెరికల్చర్ అధికారులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, సంతోశ్, శరవణ, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

రొంపిచెర్ల,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల కోసం వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్లలోని రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ చేశారు. టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, రాజంపేట పార్లమెంట్ మైనారీ సెల్ ఇమ్రాన్‌ఖాన్, కరీముల్లా, సింగల్ విండో చైర్మన్ రఘునాధరెడ్డి, డైరెక్టరు సురేంద్ర, నాయకులు రామ్మూర్తి, తులసీరాం, నాగిశెట్టినాగరాజ, శేషాద్రినాయుడు, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏవో శ్రావణి, ఏఈవో నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.


రాయితీ ఉలవలు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రైతు సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎంరాజు

రామకుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని కుప్పం ఏఎంసీ చైర్మన్ జీఎంరాజు తెలిపారు. బుధవారం రామకుప్పం మండలం సచివాలయంలో ఉపాధిహామీ, వెలుగు అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతు సంఘాల ఏర్పాటును వారంలోపు పూర్తయ్యేలా అందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. భవిష్యత్‌లో రైతు సంఘాలతో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఆసరా అందిస్తుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వపరంగా రైతులకు అందుతున్న పథకాలను వివరించాలని, ఎవరికైనా పథకాలతో లబ్ధి అందకుండా ఉంటే వారికి తగు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్ రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పవన్‌కుమార్, మునీంద్రనాయక్, రెస్కో డైరెక్టర్లు విజయ్‌కుమార్, సతీష్, కడా పీఏసీ సభ్యుడు రఘు, నేతలు గుర్రప్ప, భానుమూర్తి, వెంకటేశ్, వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి, ఉపాధి ఏపీవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-సైకిల్ వాడకంతో ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఏపీఆర్ కుమార్

శాంతిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ-సైకిల్ వాడకంతో శారీరక ఆరోగ్యం సమకూరుతుందని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. బుధవారం మండల సచివాలయం ఎదుట ఈ-సైకిల్ డెమో చేపట్టారు. కాలుష్య రహిత నియోజకవర్గంగా కుప్పంను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఈ-సైకిల్ ఉపయోగించడంతో వాయు కాలుష్యం తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే పెట్రోల్ ఖర్చు ఉండదన్నారు. ప్రభుత్వం రాయితీపై రూ.25 వేలకు మాత్రమే అందిస్తుందని.. రూ.5 వేలు చెల్లిస్తే మిగిలిన నగదును వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చన్నారు. పంచాయతీకి 50 సైకిళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు గ్రామ సచివాలయ పరిధిలో జరిగే గ్రామసభల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో రెడ్డమ్మ, వెలుగు, ఉపాధి సిబ్బంది, క్లస్టర్ ఇన్‌చార్జి పీవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గంగవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించి ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడానికి కృషిచేయాలన్నారు. మదర్‌థెరీసా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మేలుమాయి గ్రామంలోని జడ్పీ హైస్కూల్, సచివాలయం పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేలుమాయి హెచ్ఎం శ్రీధర్ బాబు, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి దేవేంద్రలతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర సమగ్ర శిక్షా డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు

రొంపిచెర్ల, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర సమగ్ర శిక్షా డిప్యూటీ డైరెక్టరు దేవరాజులు అన్నారు. ఆయన బుధవారం రొంపిచెర్లలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు, విద్యాప్రమాణాలు, వసతులు, ఉపాధ్యాయుల వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుంగనూరు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దూళ్లవాళ్లవీధికి చెందిన బాలిక (15) రెండు రోజులుగా కనిపించలేదని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు వెంకటరమణస్వామి కల్యాణం

పుంగనూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద గల కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా శ్రీవారి కల్యాణం, గరుడసేవ ఘనంగా జరుగుతుందని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా వెంకటరమణస్వామికి ప్రతినెలా పౌర్ణమికి కల్యాణాన్ని జరిపిస్తారన్నారు. అనంతరం గరుడవాహనంపై పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించబడునని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుదాం


కుప్పంలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో రాజారాం


కల్లూరులో ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కుప్పం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను వారి తల్లిదండ్రులు భగవం తుడిచ్చిన బహుమతిగా స్వీకరించాలని.. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని కుప్పం ఎంఈవో-2 రాజారాం అన్నారు. కుప్పం పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు వారి సామర్థ్యానికి అనుగుణమైన ఆటల పోటీలు, చిత్ర రచన పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఎంఈవో-2 రాజారాం మాట్లాడుతూ దివ్యాంగులపై సమాజం సానుకూల దృక్పథంతో ఉండాలన్నారు. ప్రభుత్వం వారికి అనేక ప్రయోజనాలు చేకూర్చుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కో ఆర్డినేటర్ జయంతి, ఉపాధ్యాయులు దేవేంద్ర, పోతుగుంట చిట్టిబాబు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **కల్లూరు:** విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మంగళంపేట సచివాలయంలోబుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. సర్పంచులు రాణెమ్మ, మధు, వాసుదేవరెడ్డి, హెచ్ఎం రేవతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సీఆర్పీలు మునీర్, వేణుమాధవ్, మునీశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **గంగవరం:** లక్ష్యంతో ముందుకెళ్తే అంగవైకల్యం ఏమాత్రం అడ్డుకాదని పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్ అన్నారు. బుధవారం గంగవరం హైస్కూల్ లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వెంకట్రామన్ విద్యార్థులకు ఆటవస్తువులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్, హెచ్ఎం చెంగల్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ ఐఈఆర్టీలు సురేఖ, త్రిలోక్, న్యాయవాది షేక్ షరీఫ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలోని భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవోలు జనార్దన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, హెచ్ఎం ప్రకాష్, లోకేష్ పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు స్వీట్స్ అందించారు. ఎంఈవో లీలారాణి, హెచ్ఎం షంషీర్, ఉర్దూ స్కూల్ హెచ్ఎం షాబ్జూ, ఫిజియోథెరపిస్టు రజని, మంగేశ్వరి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని.. వారి భవిష్యతుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని రొంపిచెర్లలో ఘనంగా నిర్వహించారు.



గంగవరం: మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్


పలమనేరు: బాలికకు స్వీట్స్ అందజేస్తున్న ఎంఈవో లీలారాణి

ప్రతిభా పరీక్షకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సత్యసుప్రజ, ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ ప్రతిభా పరీక్షకు మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉష, యవతి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యసుప్రజ తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన కౌశల్ ప్రతిభా పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కుదిరిగానిగుట్టపై కార్తీక దీపోత్సవం


కుదిరిగానిగుట్టపై విశ్వబ్రాహ్మణులు వెలిగించిన కార్తీకదీపం

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమానుచేను గ్రామసమీపంలో ఉన్న కుదిరిగానిగుట్టపై బుధవారం రాత్రి బైరెడ్డిపల్లెకు చెందిన విశ్వబ్రాహ్మణులు కార్తీక దీపాన్ని వెలిగించారు. ఏటా తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం జరిగే రోజున ఇక్కడ కార్తీకదీపం వెలిగించడం ఎన్నో ఏళ్లగా ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బైరెడ్డిపల్లె నుంచి విశ్వబ్రాహ్మణులు ముత్తాచారి, రాజేంద్రాచారి, సతీష్‌ఆచారి, గజేంద్రాచారి కుటుంబ సభ్యులు కుదిరిగానిగుట్టవద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కార్తీకదీపాన్ని వెలిగించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు వాడకంతో జీవితాలే నాశనమవుతాయని.. వాటికి దూరంగా ఉండాలని పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం పుంగనూరులోని భగత్‌సింగ్ కాలనీ పరిధిలో డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే వ్యాధులు, నష్టాలు ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి మురళీ మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. గత మూడు రోజులుగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపుతో పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు మంచి విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పరామర్శ

సోమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద సర్పంచి చంద్రకళ కుమారుడు రోషన్ బుధవారం మృతి చెందారు. చింతలవారిపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎంపీపీ ఈశ్వర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు మోహన్, పీఎల్ఆర్ రాజారెడ్డి, వీవీ రమణ, వైస్ఎంపీపీ ప్రభాకర్, ఇరికిపెంట ఎంపీటీసీ హరినాథ్, సర్పంచులుతదితరులు రోషన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న సీఐ, అధికారులు

వి.కోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వి.కోట బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు స్వామికణ్ణన్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు సీఐ సోమశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో సాంఘికశాస్త్రం అర్థమయ్యేలా స్వామి కణ్ణన్ విద్యాశాఖ ద్వారా స్టడీమెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్‌ను విడుదల చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరావు, ఎంఈవోలు చంద్రశేఖర్, మురుగేష్, హెచ్ఎం విద్యావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతును రారాజు చేయాలన్నదే సీఎం సంకల్పం


కెనమాకులపల్లెలో సీఎం సందేశం వింటున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు

శాంతిపురం, డిసెంబరు 3 : రైతును రారాజు చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సంకల్పమని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు నందిగం ఉదయకుమార్‌నాయుడు అన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమం ముగింపు సందర్భంగా నారా చంద్రబాబునాయుడు సందేశాన్ని వీక్షించేందుకు కెనమాకులపల్లె సచివాలయంలో రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, కెనమాకులపల్లె పంచాయతీ పార్టీ అధ్యక్షుడు శివ, యూనిట్ ఇన్‌చార్జి గిరిధర్, జిల్లా టీడీపీ మాజీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రమేష్, కోయూనిట్ ఇన్‌చార్జి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగరాజు, టీడీపీ నేతలు ఈడిగ శివశంకర్, గడ్డూరు రమేష్, పంచాయతీ కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం


వీధి వ్యాపారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్వానిధి సంకల్ప అభియాన్ పథకంతో 966 మంది వీధి విక్రయదారులకు రూ.2.28 కోట్ల చెక్కును, 9 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ. 66 వేల చెక్కును ఆయన పంపిణీ చేశారు. పేదలకు రుణాలు అందించి సహకరించిన పలు బ్యాంకు అధికారులను ఆయన అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవిచంద్రబాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజీ, మెప్మా సీఎంఎం బాబా, నాయకులు కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజాపీర్, మదన్, బీఆర్వీ కుమార్, చాంద్ బాషా, నదీమ్, శ్రీనివాసులు, చిన్ని పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించుకుంటే దాడి చేస్తున్నారు


ఉరుస్తున్న పూరిపాకలో కృష్ణమూర్తి

చిత్తూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తన స్థలంలో ఇంటిని నిర్మించుకుంటుంటే కొంతమంది కూలదోసి తనపై దాడి చేస్తున్నారని దిగువమాసాపల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడి కథనం ప్రకారం సర్వే నెం.951లో 1వ ప్లాటును కృష్ణమూర్తి భార్య మునిరత్నమ్మ పేరిట పట్టా పొందాడు. భార్యతో కలిసి చాలా కాలంగా పూరిపాకలో జీవిస్తున్నారు. ఇటీవల వర్షాలకు అది ఉరుస్తోంది. దీంతో అప్పు చేసి ప్రభుత్వ పట్టా భూమిలో సిమెంట్ షీట్లతో షెడ్డు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొంత మంది దాడి చేసి షెడ్డును ధ్వంసం చేసినట్లు కృష్ణమూర్తి పేర్కొన్నాడు. దీనిపై ఇప్పటికే మూడుసార్లు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నాడు. వర్షంలోనే పూరి గుడిసెలో క్యాన్సర్ రోగురాలైన భార్యతో జీవిస్తున్నానని, న్యాయం చేయాలని కోరుతున్నాడు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ కరీమున్నీషా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు వివిధ అంశాలపై మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ కరీమున్నీషా కన్నన్ బుధవారం కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి వయస్సులోనే మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అనవసరంగా తాకితే.. అసౌకర్యకంగా అనిపిస్తే అధ్యాపకులకు లేదా తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. 18 ఏళ్ల నిండకముందే పెళ్లి చేయడం చట్ట విరుద్ధమన్నారు. విద్యార్థినులు, చిన్న పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. 112, 1099వంటి హెల్ప్‌లైన్ నెంబర్లను గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో మాట్లాడుతున్న వెంకటరమణ

పాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కావేరిరాజుపురం,ఆముదాల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. విద్యార్థులకు, గర్భిణీలకు అందించే పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేంద్రప్రసాద్, అంగన్వాడీ సూపర్‌వైజర్ జయశ్రీ, అంగన్వాడీ పాల్గొన్నారు.

నేడు డీడీవో కార్యాలయం ప్రారంభం

నిండ్ర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నగరి డీడీవో కార్యాలయాన్ని గురువారం ఉదయం ప్రారంభం ప్రారంభించనున్నట్లు నగరి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిఇందిరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఆమె పేర్కొన్నారురు. కార్యక్రమానికి అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

కౌశల్ సైన్స్ పరీక్షకు విద్యార్థినుల ఎంపిక

బైరెడ్డిపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ ప్రతిభా పరీక్షకు మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉష, యవతి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యసుప్రజ తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన కౌశల్ ప్రతిభా పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అధునాతన సాంకేతికత వినియోగం

కుప్పం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రిప్ ఇరిగేషన్‌లో అధునాతన సాంకేతికను మరింతగా వినియోగిస్తే రైతుల లాభాలు మరింత పెరుగుతాయని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం చందం పంచాయతీలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ పరికరాలు, డ్రిప్ సిస్టం ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతికను రైతులకు మరింతగా అందించాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. పట్టుపరిశ్రమపై రైతులు మరింత ఆసక్తి చూపాలని సూచించారు. అలాగే పశుసంవర్ధకక శాఖ ప్రతి ఇంట్లో పాల ఉత్పత్తిని పెంచడంతో కుప్పాన్ని మిల్క్ సిటీగా చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మండల వ్యవసాయాధికారి ఫయాజ్, కోదండ, సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్కూల్ బస్సుల తనిఖీలు


సిబ్బంది, డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎంవీఐ రాజేశ్వరరావు

చిత్తూరు సిటీ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. బుధవారం స్థానిక సంతపేటలోని బృందావన్ స్కూల్‌లో ఎంవీఐ రాజేశ్వర రావు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. బస్సుల రికార్డులను, ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సేఫ్టీ అలారమ్స్, బస్సుల కండిషన్లను తనిఖీ చేశారు. యాజమాన్య సిబ్బందికి, డ్రైవర్లకు, విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై తగు సూచనలు చేశారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల వితరణ



ఐరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం రాష్ట్రపతి అవార్డు గ్రహీత పత్తిపాటిజగన్మోహన్‌రావు జాపకార్థం ఆయన భార్య నాగమణి వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. పాఠశాలకు కంప్యూటర్‌ను విరాళంగా అందించారు. పాఠశాల హెచ్‌ఎం వాసుదేవయ్య మాట్లాడుతూ దాతల సహకారాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మీ, విశ్రాంత ఉపాధ్యాయుడు కె.సీతాపతినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి వైర్ల చోరీ

వెదురుకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఆర్‌కండ్రిగ కాలనీకి చెందిన రమేష్ పొలంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైర్లు చోరీ చేశారు. వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో బాధితుడు బుధవారం ఈమేరకు ఫిర్యాదు చేశారు.

మూడు అకడమిక్ పోస్టుల మంజూరు

గుడిపాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) మండలానికి మూడు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మంజూరైనట్లు ఎంఈవోలు హసన్‌బాష, గణపతిలు తెలిపారు. రామాపురం, కట్టకింద పాఠశాల, బొమ్మసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సంబంధించి అభ్యర్థులు శుక్రవారంలోగా ఎంఆర్‌సీ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎస్‌జీటీ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, పీజీతో డీఈడీ, బీఈడీ, ఎంఈడీ అర్హత ఉండాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ (తమిళ్) పోస్టుకు బీఏ, ఎంఏ(తమిళ్) బీఈడీ ఉండాలన్నారు. ఎస్‌జీటీలకు 2026 మే వరకు రూ. 10వేలు వంతున, సీనియర్ అసిస్టెంట్‌కు నెలకు రూ.12, 500 పారితోషికం ఇస్తారని ఎంఈవోలు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నగరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అకడమిక్ ఉన్నత పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శ్రీదేవి తెలిపారు. స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీష్ భాషకు ఇన్‌స్పెక్టర్ అవసరమైనందున నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ఎంఈవో కార్యాలయంలో వివరాల కోసం సంప్రదించవచ్చన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

చిత్తూరు సిటీ, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని జోన్ ఫోర్ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు గత వైసీపీ ప్రభుత్వం అనేక మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించిందన్నారు. వాటన్నింటినీ త్వరలోనే ఎత్తివేస్తామని చెప్పారు. జీడీ నెల్లూరుకు సంబంధించి ఎమ్మెల్యే థామస్ వ్యతిరేకవర్గం ఎమ్మెల్సీని కలసి ఫిర్యాదు చేయగా, ఆయనతో ఇబ్బంది లేదని ఎమ్మెల్యే అనుకూల వర్గం కూడా ఎమ్మెల్సీతో చెప్పినట్లు సమాచారం. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, సురేంద్ర కుమార్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, కోదండ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలోకి అంగన్‌వాడీ కేంద్రం


అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

యాదమరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్నంపల్లి దళితవాడలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రం భవనంపై ప్రచురితమైన కథనంపై అధికారులు తక్షణమే స్పందించారు. బుధవారం కేంద్రాన్ని ఎంపీడీవో వీరేంద్ర, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సరళ, కార్యదర్శి శివరాజ్ సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా ఎంపీపీ పాఠశాల భవనంలోకి మార్చి, అక్కడి గదిలో పిల్లల కోసం ఉపయోగించుకోవాలని సూచించారు.

కాణిపాకం ఆలయ ఛైర్మన్‌కు సన్మానం


మణినాయుడిని సత్కరించిన టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ కార్యాలయంలో బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఛైర్మన్ మణినాయుడిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ చెర్మన్ ఆలయ తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌గౌడ్,కోకా ప్రకాష్‌నాయుడు, హేమచంద్రనాయుడు, లోకేషరెడ్డి, రాధాక్రిష్ణమనాయుడు, సూరినాయుడు, హరి తదితరులు ఉన్నారు.

మద్దతు ఇవ్వండి

నిండ్ర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేతమ్స్ చెరకు రైతులు కార్మికుల బకాయిల కోసం నిర్వహించే ఆత్మీయ సదస్సుకు మద్దతు ఇవ్వాలని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌ను రైతులు కోరారు. బుధవారం పుంగనూరులో ఆయన్ను కలిశారు. బకాయిలు ఇప్పించడానికి కృషి చేయాలని కోరారు. చెరకు రైతు నాయకులు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

గమ్యం చేరాలంటే ఏరు దాటాల్సిందేనా...

ఆత్మకూరు-నరసింగరాయనిపేట, కలిజవేడు-కొట్రకోన గ్రామాల ప్రజల అవస్థలు


నరసింగరాయనిపేట వెళ్లేందుకు నీవానది ఏరు దాటుతున్న విద్యార్థులు,కూలీలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నీవానది ప్రవాహంతో రెండు ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గమ్యం చేరుకోవడం దూరభారమవుతోందని వీరు వాపోతున్నారు. ఆత్మకూరు-నరసింగరాయనిపేట, కలిజవేడు-కొట్రకోనల మధ్య ఈ ఇబ్బంది ఎదురయింది. ఆత్మకూరు-నరసింగరాయనిపేట మధ్య నీవానది మూడునెలలుగా ప్రవహించడంతో ఏటిలో రెండు చోట్ల మట్టిరోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నరసింగరాయనిపేటలో విద్యాసంస్థలు, గ్రామీణబ్యాంకులకు ఆత్మకూరు, కడపగుంట, అంబోధరపల్లె, ఎల్లాపల్లె పంచాయతీలకు చెందిన పలువురు వెళుతుంటారు. నీవానది జోరు వల్ల కొద్ది రోజులుగా ఈ ఈమర్గంలో వెళ్లడం మానేశారు. ఇటీవల ప్రవాహం కొంత తగ్గడంతో అవస్థలు పడుతూ నరసింగరాయనిపేటకు వెళుతున్నారు. నదిలోకి దిగకుండా వెళ్లాలంటే సుమారు 22 కిలోమీటర్ల దూరాన్ని రెండు బస్సులు మారి వెళ్లాలి. కలిజవేడు-కొట్రకోన మధ్య కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. ఈరెండు ప్రాంతాల వద్ద ఏటిలో తాత్కాలిక మట్టిరోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో కూలీలు సుమారు 20రోజులుగా నది దాటుకుని వెళుతున్నారు. వీరు గంగాధరనెల్లూరు మీదుగా చిత్తూరుకు చేరుకోవాలంటే సుమారు 16 కిలోమీటర్లు ప్రయాణించాలి. లేదంటే పెనుమూరు మండలం మీదుగా చేరుకోవాలంటే 20 కిలోమీటర్లు వెళ్లాల్సి. మట్టిరోడ్లు కొట్టుకుపోవడంతో తిప్పలు తప్పడంలేదని ఈ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు-నరసింగరాయనిపేట, కలిజవేడు-కొట్రకోనల మధ్య లోలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని వీరు కోరుతున్నారు.

దారి వివాదానికి పరిష్కారం


రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్- పరిష్కరించి చూపిన దారి

వెదురుకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు, పోలీసుల చొరవతో దారి సమస్య పరిష్కామైంది. కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామ పంచాయతీ కరవాటికండ్రిగకు చాన్నాళ్లగా దారి లేదు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల వినతి మేరకు 2015లో జిల్లా పరిషత్తు నిధులతో రోడ్డు నిర్మించారు. రైతులు కూడా అభ్యంతరాలు చెప్పకుబా అంగీకరించారు. అయితే పొలంలో స్థలమిచ్చిన ఓ రైతు తనకు గ్రామస్తులు 'పరిహారం' చెల్లించకపోతే రాతి కూశాలు నాటి పెన్సింగ్ వేస్తామని హెచ్చరించారు. సోమవారం తాననుకున్న పనిచేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనిపై తహసీల్దార్ కె.నాగరాజుకు ఫిర్యాదు అందడంతో బుధవారం ఆర్ఐ నరసింహులుమ సర్వేయర్ మార్కొండయ్య, రెవెన్యూ సిబ్బందితో పాటు పోలీసులను తీసుకెళ్లి రోడ్డుకు అడ్డంగా ఉన్న రాతి స్తంభాలను తొలగించారు. అక్కడి రైతులతో చర్చించారు. దారి వివాదం పరిష్కారమవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పదవ తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ


మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకమని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదవ తరగతి మోడల్ పేపర్‌ను ఆయన ఆవిష్కరించారు. . మోడల్ పేపర్స్ కావలసిన వారు 9490825982, 9705970098 నెంబర్లను సంప్రదించాలని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, గౌరవాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు బి.నాగరాజా, జీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతి అందజేస్తున్న శ్రీధర్‌రాజు

నిండ్ర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్‌రాజు బహుమతులు ప్రదానం చేశారు. సహిత ఉపాధ్యాయులు .పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష పీవో వెంకటరమణ, జిల్లా సమగ్రశిక్ష కోఆర్డినేటర్ మధు అవగాహన కల్పించారు. పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంఈవో కాణిపాకం ఆంజినేయులుశెట్టి, హెచ్.ఎంలు తదితరులు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** తగ్గువారిపల్లె భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆటల పోటీల విజేతలకు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌గౌడ్ బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో మహేష్, ఎంఈవో లునాగేశ్వర్‌రావు, రమేష్ బాబు, డైట్ లెక్చరర్ శైలజ, నటి సుధాచంద్రన్, గిరిబాబు, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం


పాళ్యంకొండలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిపాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రఘునాథపురం సమీపంలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామికొండలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహించి గిరిప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గుర్రప్ప నాయుడు, వైస్ ఛైర్మన్ మోహన్, కమిటీ సభ్యులు తారకరామ్, రాజు, డిల్లీబాబు, రెడ్డెప్ప నాయుడు, తదితరులు పాల్గొన్నారు.**గంగాధరనెల్లూరు:** గంగాధరనెల్లూరు మండలంలోని శివాలయాలు భక్తులతో బుధవారం కిటకిటలాడాయి. ఉదయం పూజలు చేశారు. సాయంత్రం మహిళలు ప్రమీదలతో దీపాలు వెలిగించారు. కొట్రకోన, గంగాధరనెల్లూరు (నక్కరాళ్ళపల్లె బండ వద్ద), మహదేవమంగళం,సిద్దేశ్వరస్వామి,వెజ్జుపల్లె, వేల్కూరు శివాలయాల్లో భక్తుల తాకిడి కనపించింది.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి


డైరెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ నాయుడు

బంగారుపాళ్యం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం,ఐరాల మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని ఏఎంసీ ఛైర్మెన్ భాస్కర్ నాయుడు చెప్పారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో డైరెక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు ఈ యేడాది రూ.1.07కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. యార్డులో అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ సుధాకర్, కార్యదర్శి వెంకరమణ, సూపర్‌వైజరు గంగయ్య,డైరెక్టర్లు పాల్గొన్నారు.

మసీదు కమిటీ నియామకంపై అభ్యంతరం

నగరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రకాశం రోడ్డులోని జామా మసీదు కమిటీని సంబంధం లేని వ్యక్తులు ప్రకటించడం విచారకరమని నగరిలో ఓ వర్గం విమర్శించింది. బుధవారం నగరిలో వారు మాట్లాడుతూ జామా మసీదు పెద్దలతో సంప్రదించకుండా కమిటీని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.బి.సలీం, సైథాలి, కరీం, అబ్బాస్, తమిన్, నాగోర్, జాకీర్, హమీద్, రఫీ, జమాత్‌లు పాల్గొన్నారు.

రైతన్నా మీకోసంపై వర్క్‌షాపు

విజయపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పన్నూరు, ఆలపాకం రైతు భరోసా కార్యాలయంలో ఏవో రజినీ కుమారి రైతులకు బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని టీవీ ద్వారా వినిపించారు. రైతులు నూతన పద్ధతిలో సాగు చేయు విధానాలను, లాభసాటిగా చేయు విధానాలను వివరించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ శివలింగం, నాయకులు బాబు, మహిళా రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వృద్ధాశ్రమంలో గోపిశెట్టిపల్లికి చెందిన అజిత్‌కుమార్ కుటుంబీకులు బుధవారం అన్నదారం చేశారు. పండ్లు, స్వీట్లను అందజేశారు. ఆశ్రమ సూపర్‌వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



వెదురుకుప్పం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం పంచాయతీ చిన్నపొటుజేను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు శ్రీలక్ష్మి గ్రూప్స్ అధినేత కె.ప్రసాద్ బుధవారం టీవీ అందజేశారు. దాత వితరణపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడి తల్లి మృతికి సంతాపం


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఆర్ రాజన్

శ్రీరంగరాజపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆరిమాకులపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జగదీశ్వర్ నాయుడు కుమారి తల్లి మృతికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు సి.ఆర్ రాజన్ సంతాపం ప్రకటించారు. బుధవారం గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహనికి పూలమాల వేసి నివాళార్పించారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ్మ నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయచంద్ర నాయుడు, జిల్లా సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మోహన్‌రాజ్, నాగేశ్వర రాజు, రమేష్ నాయుడు, అంజనేయ నాయుడు పలువురు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వైభవంగా రుద్ర హోమం

పాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాచపాళ్యంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో బుధవారం కార్తీక దీపోత్సవం, రుద్ర హోమాలను నిర్వహించారు. స్వామి మూల విరాట్‌కు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.ఆలయం చుట్టు 101 నెయ్యి దీపాలు వెలిగించారు. ఆలయం ముందు 60 కేజీల నెయ్యి దీపాన్ని వెలించారు. మండల వాసులతో పాటు తమిళనాడు, బెంగళూరు నుంచి భక్తులు తరలివచ్చారు.

ఘనంగా సప్తకన్నికల అమ్మవార్లకు పూజలు


అమ్మవార్ల సన్నిదిలో భక్తులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లెలో సప్తకన్నికల అమ్మవార్లకు బుధవారం మొదిలియార్ సంఘం డైరెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్న కేశవులు నాయుడు అమ్మవార్లకు వాయినం సమర్పించారు. భక్తులు దీపారాధనలు చేశారు. కార్యక్రమంలో తిరుకుమరన్, నళినీ తిరుకుమరన్, ఈవో వెంకట్రాయలు పాల్గొన్నారు. సంతపేట కనకదుర్గా ఆలయంలో నిర్వాహకులు అమ్మవారిని అర్ధనారీశ్వర అలంకారంలో దర్శనం కల్పించారు. గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరాలయంలో మహాదీపరాధన చేశారు. గిరింపేట దుర్గాంబ, చిదంబరేశ్వరా ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు కార్తీకమాస దీపారాధనలు చేశారు.


జిల్లాలో డీడీవో కార్యాలయాల ప్రారంభ కార్యక్రమ పర్యవేక్షణకు పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ్ బుధవారం చిత్తూరుకు చేరుకున్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, జిల్లా స్థాయి అధికారులు పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు.
-చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి